# ద్రౌపది అంతరంగ ఆవిష్కరణ

ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ గారి ద్రౌపది నవల ధారావాహికంగా వస్తున్నప్పుడు ఒక మిత్రుడి సూచనపై చదవడం మొదలుపెట్టాను. కురుక్షేత్ర యుద్ధం దాదాపు పరిసమాప్తమౌతున్న సమయంలో జరిగిన అత్యంత విషాద భరితమైన సంఘటనతో పుస్తకాన్ని ప్రారంభించిన తీరు నన్ను ఆశ్చర్యపరిచింది. ఉత్కంఠనూ కలిగించింది. మిగతా పుస్తకాన్ని ఆసక్తిగా చదివించింది. ఇటీవల ఈ పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు వచ్చినప్పటి నుంచి వివిధ మీడియా రంగాలలో ఈ పుస్తకం మీద చాలా చర్చ జరుగుతున్నది. చర్చల్లో పాల్గొంటున్న కొంతమంది ఈ పుస్తకం సరిగ్గా చదవనే లేదని, పురాణ పాత్రలకు ఆధునిక భాష్యాలు చెప్పటంపై తమకు ఉన్న భావనల ఆధారంగానే మాట్లాడుతున్నారని నాకు అనిపించింది.

ద్రౌపది కథ మనకు తెలియనిది కాదు. ద్రోణుణ్ణి నిర్జించే కుమారుని కోసం తపస్సు చేస్తున్న ద్రుపదునికి ఆ కుమారునితో పాటు యజ్ఞఫలంగా ఆయాచితంగానే లభించిన అసాధారణ సుందర కన్య ద్రౌపది. ఆమెను పార్థునికిచ్చి వివాహం చేయాలనుకొన్న ద్రుపదుడు, పాండవులు మరణించారన్న వార్త విని, ఆమెకు స్వయంవరం ప్రకటించాడు. అనేక మంది రాజులు, రాజకుమారులు పాల్గొన్న ఆ స్వయంవరంలో ఒక బ్రాహ్మణ యువకుడు గెలిచాడు. ఆ తర్వాత పెద్ద యుద్ధమే జరిగింది. స్వయంవరంలో గెలిచినవాడు, అతని సోదరులు యుద్ధంలో కూడా గెలిచి, ఆమెను తమ తల్లి దగ్గరకు తీసుకువెళ్ళారు. ఆ తల్లి అనాలోచితంగానో, ఆలోచితంగానో అన్న మాటకు కట్టుబడి ఆమె ఆ అయిదుగురు సోదరులనూ పెళ్ళి చేసుకోవటానికి ఒప్పుకుంది. ఆ తర్వాతే వారు పాండుకుమారులని ఆమెకు తెలిసింది.

పాండవులు ప్రచ్ఛన్న వేషాలు వీడి ఇంద్ర ప్రస్థంలో జీవించటం మొదలుపెట్టారు. ద్రౌపదితో ఏకాంతోల్లంఘన లేకుండా ఒక్కొక్కరూ ఒక సంవత్సరం గడపాలని అన్నదమ్ములు చేసుకొన్న ఒప్పందాన్ని అతిక్రమించిన అర్జునుడు ఏడాది పాటు తీర్థయాత్రలకు వెళ్ళి మూడు వివాహాలు చేసుకుని, శ్రీకృష్ణుడి చెల్లెలు సుభద్రను ఏకంగా ఇంద్రప్రస్థానికే తెచ్చాడు. రాజసూయం చేసిన పాండవులను చూసి అసూయపడిన దుర్యోధనుడు మాయాద్యూతంలో గెలిచి పాండవులనూ, ద్రౌపదినీ బానిసలుగా చేసుకున్నాడు.

అంతకుముందు ఏ మహారాణికి జరగని అవమానాలు ద్రౌపదికి జరిగాయి. ఏక వస్త్ర ఐన ద్రౌపదిని నిండుసభకు జుట్టుపట్టుకుని ఈడ్చుకు వచ్చాడు దుశ్శాసనుడు. ఆమె పతుల ముందే ఆమెను వివస్త్రను చేయబూనాడు. దుర్యోధనుడు ఆమెను కూర్చోమని తన తొడను చూపించాడు. మరోసారి జూదమాడి పాండవులను అడవుల పాలు చేశాడు. ద్రౌపది పాండవులతో పాటు పన్నెండేళ్ళు వనవాసం చేయవలసి వచ్చింది. ఆ సమయంలోనే సైంధవుడు ద్రౌపదిని అపహరించడానికి ప్రయత్నించాడు. వనవాసం ముగిశాక అజ్ఞాత వాసం కోసం విరాటపురం వెళ్ళినప్పుడు, ద్రౌపది విరాట రాణికి సైరంధ్రిగా ఉండవలసి వచ్చింది. కీచకుడు ఆమెను బలవంతంగా అనుభవించటానికి ప్రయత్నించి భీముని చేతిలో మరణించాడు.

అజ్ఞాతవాసం తరువాత రాయబారాలు, సంధి ప్రయత్నాలు జరుగుతున్నప్పుడు ద్రౌపది వాటిని వ్యతిరేకించింది. యుద్ధం జరిగి, తనను అవమానించిన వారిని తన భర్తలు నిర్జించి తన పగ తీర్చాలని ఆమె కోరుకుంది. ఆ కోరిక నెరవేరే క్రమంలో తన పుత్రులను కోల్పోయి పెద్ద మూల్యమే చెల్లించింది. ఆ తర్వాత ఆమె కొన్నేళ్ళుగా హస్తినాపుర పట్టమహిషిగా జీవించింది. కృష్ణుడు మరణానంతరం పాండవులు మహాప్రస్థానం ప్రారంభించారు. ఆ యాత్రలో అందరికన్నా ముందు మరణించింది ద్రౌపది.

మనకు బాగా పరిచయమైన ఈ మహాభారత ఘట్టాలతో పాటు ద్రౌపది పూర్వజన్మల కథను కొంత విపులంగా రచయిత వర్ణిస్తాడు. పూర్వ జన్మలలో ఆమె ముందు వేదవతి, ఆ తరువాత మౌద్గల్య ముని భార్య ఇంద్రసేన (నాలాయని). ఆమె పాతివ్రత్యానికి మెచ్చిన మౌద్గల్యుడు ఆమెతో ఏకకాలంలో ఐదు రూపాల్లో (త్రిమూర్తులు, ఇంద్రుడు, మన్మథుడు) రమించాడు. ఆ తరువాతి జన్మలో ఆమె కాశీరాజు కుమార్తె అనామికగా జన్మించింది. పతికోసం ఘోరమైన తపస్సు చేసింది. ఐదుగురు పతులను అనుగ్రహించాడు శివుడు. నీకు ఐదుగురు పతులున్నా అది ధర్మవిరుద్ధమని ఎవరూ భావించరు అని, ఆమె కోరుకున్న విధంగా ఐదుగురితో సుఖించడానికి తగ్గ యవ్వనం, కామభోగేచ్ఛ, వారిని సేవించేందుకు అవసరమైన శుశ్రూషాభావం, కన్యాత్వం, సౌభాగ్యం అనుగ్రహించాడు. మరుజన్మలో ఆమె యజ్ఞం చేస్తున్న ద్రుపదుడికి అగ్ని గుండంలో లభించింది.

ఈ పుస్తకం మనం మామూలుగా చదువుకొనే పాండవ కౌరవుల కథే. కాని ఇది ప్రధానంగా ద్రౌపది దృక్పథం నుంచి చెప్పబడిన కథ. ద్రౌపది మనోభావాల కథ. ఆమెకెదురైన విపరీత పరిస్థితులకు ఆమె స్పందనల కథ. ఈ కథలో ద్రౌపది ఒక నిస్తేజమైన, నిస్సహాయమైన, అణిగిమణిగి ఉన్న సామాన్య స్త్రీ కాదు. రక్తమాంసాలు, జవసత్వాలు, నిండు మనసుతో సజీవమైన విశిష్ట మహిళ. ఆమె అసాధారణ సౌందర్యరాశి, రూపేచ లక్ష్మి. సునిశితంగా ఆలోచించగల్గిన, రాజనీతి తెలిసిన ఆమె పాండవులకు కరణేషు మంత్రి. తన పతులపై విపరీతమైన అనురాగం కలిగిన ఆమె సోదరులైదుగురికీ శయనేషు రంభ. అనేక అవమానాలను, తన పతుల తప్పిదాలను సహించిన ఆమె క్షమయా ధరిత్రి.

తెలిసిన కథను మనకు మళ్ళీ చెప్పటానికి రచయిత ఎంచుకొన్న క్రమం నాకు నచ్చింది. మనకు పరిచయమైన క్రమంలో నడవదు ఈ కథ. లక్ష్మీప్రసాద్ శైలి చదువరిలో ఉత్కంఠను రేకెత్తించి పుస్తకాన్ని కడవరకూ చదివింపచేస్తుంది. ఆయన వాక్యాలూ, సన్నివేశాలూ ఉద్విగ్నంగా వడివడిగా పరిగెడతాయి.

నాకు నచ్చిన మరో విషయం పాండవు లైదుగురి వ్యక్తిత్వాలను ద్రౌపదితో ప్రథమ సమాగమపు సమయంలో వారి ప్రవర్తనలద్వారా రచయిత ఆవిష్కరించిన విధం. తన ఐదుగురు భర్తల విభిన్న మనస్తత్వాలను ఆకళింపు చేసుకొని వారి మనోభావాలకు అనుగుణంగా ద్రౌపది ప్రవర్తించే విధానాన్ని ఆసక్తికరంగా చిత్రీకరించారు.

ఈ నవలలో ద్రౌపదికి ముఖ్య స్నేహితులు కుంతి, కృష్ణుడు. ద్రౌపది వలే కుంతి కూడా విలక్షణమైన పురుష సంబంధాలు కల్గినదే. ద్రౌపది మానసిక సంఘర్షణలను, సందిగ్ధాలనూ అర్థం చేసుకొని ద్రౌపదికి మానసిక సాంత్వనను కలిగించటానికి కుంతి ప్రవర్తించే తీరు ఆలోచింపచేస్తుంది. కాని కుంతి తన గురించి ఏమనుకొంటుందో రచయిత స్పష్టంగా చెప్పలేదనిపించింది. ఇక కృష్ణకూ, కృష్ణునికీ ఉన్న సంబంధం చాలా విలక్షణమైనది. ఇద్దరికీ ఒకరిపట్ల ఒకరిపై విపరీతమైన మమకారం. మానసికంగా వారిద్దరూ అతిసన్నిహితులు. ఆమె కృష్ణుని ఆరాధిస్తుంది.

ఈ పుస్తకానికి సాహిత్య అకాడెమి బహుమతి వచ్చాక వినిపిస్తున్న తిట్లు, శాపనార్థాలు, వెటకారాలు పక్కన పెట్టి, కొన్ని ప్రధాన విమర్శలపైన నా అభిప్రాయాలు వివరిస్తాను.

**అ) ఈ పుస్తకంలో శృంగారం మితిమించి ఉంది. ద్రౌపది శరీర వర్ణనలు, ఐదుగురి భర్తలతో ఆమె గడపిన మొదటి రాత్రుల వర్ణనలు ఉచితంగా లేవు.**

241 పేజీలున్న ఈ పుస్తకంలో ద్రౌపది తన భర్తలతో కూడిన పంచరాత్రుల వర్ణనలు ఐదు ప్రకరణాలలో 13 పేజీలలో ఉంటాయి. ఆ శృంగార వర్ణన కానీ, ద్రౌపది సౌందర్య వర్ణన కానీ – నా అభిప్రాయంలో – సగటు ప్రబంధాల్లో ఉన్న వర్ణనలకన్నా గానీ, లేక ప్రస్తుతం పత్రికలలో కనిపిస్తున్న శృంగార కథలకన్నా గానీ తక్కువగానే ఉన్నాయి. ఈ పంచరాత్రుల్ని కూడా పాండవు లైదుగురి విభిన్న తత్వాలను ద్రౌపది అర్థం చేసుకోవటంకోసమే వినియోగించుకొన్నారు రచయిత. ఉదాహరణకు ద్రౌపదీ అర్జునుల మొదటిరాత్రి గురించిన మూడున్నర పేజీల ప్రకరణంలో, వారి శృంగార క్రీడ వర్ణన ఏడు లైన్ల పేరాగ్రాఫుకు మాత్రమే పరిమితమయ్యింది; మిగతా మూడుంబావు పేజీలు వారిద్దరి మనస్తత్వాలూ, మానసిక సన్నిహిత్యాల చిత్రణే. పుస్తకంలో ఉన్న శృంగారం చాలావరకూ పరస్పర అనురాగరక్తులూ, యవ్వనవంతులూ ఐన భార్యాభర్తల మధ్య పెళ్లయిన తర్వాత పడగ్గదిలో జరిగిందే. ముద్దులూ, కౌగలింతలూ వగైరా ఈ పుస్తకంలో చాలాచోట్ల కనిపించినా, అవన్నీ కథాగమనంలో కలసిపోయినవే (ఈ పుస్తకంలో మొదటి శృంగారఘట్టం 75వ పేజీలోగానీ కనిపించదు). కామకార్యకలాపాల వర్ణన కోసమే ఈ పుస్తకం చదివితే నిరాశ తప్పదు.

ద్రౌపది సౌందర్య వర్ణన చాలాసార్లు కనిపిస్తుంది. ఐతే ఈ పుస్తకంలో ఒక ముఖ్య ప్రతిపాదన – ద్రౌపది సౌందర్యానికి ఆకర్షితులై ఆమెను పొందలేకపోయిన కర్ణుడు, కౌరవులు, ఇతర రాజుల ఈర్ష్యాద్వేషాలు భారతయుద్ధానికి ఒక ముఖ్యకారణం అని. ఆ నేపథ్యంలో ద్రౌపది సౌందర్యానికి ఈ పుస్తకంలో ప్రాధాన్యత ఇవ్వక తప్పదు. ఈ పుస్తకంలో శృంగారం ఎక్కువగా ఉందని చాలామంది అభిప్రాయపడటానికి పలుమార్లు కనిపించే ఈ సౌందర్య వర్ణనే కారణమనిపిస్తుంది.

**ఆ) ద్రౌపదిని స్వైరిణిగా, వేశ్యగా చిత్రీకరించారు.**

ఇది బొత్తిగా నిరాధారమైన ఆరోపణ.ఈ పుస్తకంలో ఎక్కడా ద్రౌపది తన భర్తలను తప్ప ఇంకా వేరెవరినీ శృంగారేచ్ఛతో కనీసం చూసినట్లు కూడా రాయలేదు. ద్రౌపదిని శృంగారానురక్తగా చిత్రించటం, తన భర్తలతో భోగించటంపై ఆమెకు ఉన్న మక్కువను అనేక సందర్భాల్లో చెప్పిన మాట నిజమే. ఆమె పూర్వజన్మ వృత్తాంతాలను వర్ణించేటప్పుడు కూడా ఆమెకు ఉన్న కామేచ్ఛ ప్రధానంగా కనబడిన మాట వాస్తవమే. ఇది తన కల్పన కాదనీ, ఆదిపర్వంలోని పంచేంద్రోపాఖ్యానంలోనే ఈ కథ ఉందనీ విపులంగా ముందుమాటలో చెప్పారు రచయిత.

ఈ పుస్తకంలో ద్రౌపది చాలా బలమైన ఉద్వేగాలు (strong passions) కల వ్యక్తి. ఇది ఒక్క శృంగార విషయంలోనే కాదు. ఆమె రాగవిరాగాలలోనూ, ఆగ్రహానుగ్రహాలలోనూ కూడా అంతే. రచయిత ముందుమాట ప్రకారం ఈ నవలా రచనోద్దేశం: 'ఈ జన్మలో ద్రౌపదిగా ఏ కోరికలు ఈడేర్చుకోవటానికి పరమశివుని వరప్రసాదంగా జన్మించిందో, ఆ కోరికలు తీరాయా లేదా అన్న విషయం చర్చిస్తూ, ద్రౌపది మహోన్నతమైన వ్యక్తిత్వాన్ని, ప్రశంసనీయమైన ఆమె ఆత్మవిశ్వాసాన్ని, మహిళా లోకానికే మకుటాయమానంగా నిల్చిన ఆమె సౌశీల్యాన్ని, కుమార్తెగా, సోదరిగా, భార్యగా, తల్లిగా, శ్రీకృష్ణుని సఖిగా, మహారాజ్ఞిగా, రాజనీతిజ్ఞురాలిగా, విదుషీమణిగా, ఉత్తమ ఇల్లాలుగా, గృహిణిగా వివిధ రూపాలలో పరిఢవిల్లిన ఆమె వ్యక్తిత్వ గరిమను వివరించడమే'. ఈ పుస్తకం ఆసాంతమూ చదివినవారెవరికైనా ద్రౌపది కామేచ్ఛ మాత్రమే కనిపిస్తే వారితో తన దృక్పథం పంచుకోవటంలో రచయిత విఫలమైనట్లే. ఐతే దీనికి కారణం పాఠకుడా, రచయితా అన్నది ఆలోచించవలసిన విషయం.

**ఇ) కృష్ణుడికీ, ద్రౌపదికీ మధ్య రచయిత సూచించిన సంబంధం అనుచితంగా ఉంది. కృష్ణుణ్ణి ద్రౌపది సఖుడుగా భావించటం ఆమె కృష్ణుడితో శారీరక సంబంధం కోరటాన్ని సూచిస్తుంది.**

ఈ పుస్తకంలో కృష్ణుడికీ, ద్రౌపదికీ మధ్య ఉన్న సంబంధం – మామూలుగా మనం చదివే – అన్నాచెల్లెళ్ల సంబంధం కాదు. అర్జునుడికి కృష్ణుడితో ఉన్న అసాధారణ సంబంధం లాంటిదే ఇది. ఇందులో స్నేహమూ, సాన్నిహిత్యమూ ఎక్కువ. ఎక్కడా ఈ సంబంధంలో శారీరక కామేచ్ఛ ఉన్నట్లు రచయిత చూపించలేదు. భగవంతుడిలో భక్తుడు (పురుషులు కూడా) అమితప్రేమతో ఏకమయ్యేట్టి వర్ణనల వల్లే ఉంటుంది ఈ పుస్తకంలో వీరిద్దరి మధ్య ఉన్న సంబంధం. ద్రౌపదికి, సత్యభామకు జరిగిన సంభాషణలో ఇది మరింత విశదీకరించబడుతుంది. సఖుడు, ప్రేమ అన్న పదాలు శారీరక సంబంధాలకు మాత్రమే పరిమితం కావు.

**ఈ) ద్రౌపదికి కర్ణుడి పట్ల కామవాంఛలున్నట్లు రాయటం ద్రౌపది వ్యక్తిత్వాన్ని కించపరచడమే.**

ఈ నవలలో ఎక్కడా కూడా ద్రౌపదికి కర్ణుడిపై వాంఛ ఉన్నట్టు రాయలేదు. ఆమెకు మొదట కర్ణుడంటే సూతపుత్రుడన్న తిరస్కార భావం; ఆ తర్వాత కురుసభలో తనను అవమానించటంలో ప్రముఖపాత్ర వహించిన అతడంటే అసహ్యం, కోపం. భారత యుద్ధానికి ముఖ్యకారణం కర్ణుడి ప్రతీకార వాంఛే అని ఆమె నమ్మకం. కర్ణుడు కుంతీపుత్రుడని తెలిశాక కూడా, 'తనతో వివాహమాడేందుకు అలాంటి నీచుడికి అర్హత ఉన్నదా...' అనుకొంటుంది ఈ పుస్తకంలో ద్రౌపది.

**ఉ) వ్యాసుడు మొదలైన కొందరు భారత ప్రముఖుల పాత్ర చిత్రణ అనుచితంగా ఉంది.**

విదురుని తల్లితో సమాగమ సందర్భంలో వ్యాసుడు ఆమెతో జరిపిన సంభాషణ అసందర్భంగానూ, అనుచితంగానూ, చౌకబారుగానూ ఉంది. కథాగమనానికి అంత ఉపయుక్తం కాని ఈ సంఘటన, సంభాషణ రెండూ వర్జ్యనీయమే. అలాగే ధృతరాష్ట్రుడితో సహా కౌరవసభలోని అందరూ ద్రౌపది సౌందర్యాన్ని చూడటానికి ఉవ్విళ్ళూరుతున్నారని రాయటంలో ఔచిత్యం కనిపించదు; షాక్‌వేల్యూ కోసం రాశారా అన్న అనుమానం వస్తుంది. అలాగే అక్కడక్కడా కొన్ని పదాలు, వ్యాక్యాలు, వర్ణనలు అసందర్భంగానో, అసంగతంగానో ఉన్నాయి. సరిదిద్దుకోవలసిన అవసరం ఉంది.

**ఊ) రచయిత తనుగా కొత్తగా చెప్పిందేమీ లేదు; పూర్వ రచయితలు చెప్పిందే మక్కికిమక్కి గద్యంలో రాశారు అని కొందరంటుంటే, ఇంతకుముందెవ్వరూ రాయని కొత్త (అభ్యంతరకరమైన) విషయాలతో రచయిత ఈ పుస్తకాన్ని నింపేశారు అని మరికిందరు అంటున్నారు.**

ఇవి రెండూ పరస్పర విరుద్ధమైన అరోపణలు.

**ఎ) ఈ పుస్తకం రాయటంలోనూ, దీనికి అకాడమి అవార్డు ఇవ్వటంలోనూ హిందూ మత ద్వేషం, పనిగట్టుకొని హిందువులను అవమనించాలన్న కుట్ర ఉన్నాయి.**

పురాణ పాత్రలను తమకు అభ్యంతరకరంగా చిత్రీకరించారని తప్ప ఈ ఆరోపణకు వేరే ఆధారాలేమీ కనిపించవు. రచయితగానీ, ఈ సంవత్సరం న్యాయ నిర్ణేతలుగా ఉన్నారని చెప్పబడుతున్న వారు (కాళీపట్నం రామారావు, బేతవోలు రామబ్రహ్మం, వి.ఎస్ రమాదేవి) కానీ ఇంతకు ముందెప్పుడూ హిందూ మతానికి వ్యతిరేకమైన పనులు చేసినట్టు నేను వినలేదు.

**ఏ) ఈ పుస్తకానికి బహుమతి రావటం వెనకాల రాజకీయ, ఇతర ఒత్తిళ్లు ఉన్నాయి.**

రచయిత రాజకీయ ప్రముఖుడైనప్పుడు సహజంగానే వచ్చే అనుమానమే ఐనా ఇది న్యాయనిర్ణేతల నిజాయితీని శంకించడమే అవుతుంది. నా మట్టుకు నాకు ఈ ముగ్గురి న్యాయనిర్ణేతల పట్ల ఉన్న గౌరవం ఈ ఆరోపణకు విలువను ఇవ్వనివ్వడం లేదు.

**ఒ) ఇంతకన్నా మంచి పుస్తకాలు చాలా ఉండగా ఈ పుస్తకానికే ఇవ్వాలా? (ఈ అభ్యంతరంలోనే, ఇతర పర్యాయ ప్రశ్నలు: ఈ అవార్డును దళిత రచయితకో, తెలంగాణ రచయితకో ఇవ్వచ్చుగా?)**

ఈ సంవత్సరం బహుమతి కోసం ఏ పుస్తకాలు పరిగణించబడ్డాయో, వాటిని ద్రౌపదితో ఎలా పోల్చాలో నాకు తెలీదు. ఇలాంటి బహుమతుల్లో కూడా ఒక కోటా పద్ధతి ఉండాలని వాదించేవారితో నేను ఏకీభవించను. ఏ అవార్డులైనా అవి ఇచ్చే సంస్థ నిర్ణయించుకొన్న పరిమితుల, నిబంధనల పైనా, అప్పటి న్యాయనిర్ణేతల అభిరుచులపైనా ఆధారపడి ఉంటాయి. లోకో భిన్న రుచి.. న్యాయ నిర్ణేతలు మారితే ఏ అవార్డు ఎంపికైనా మారే అవకాశం ఎక్కువగానే ఉంటుంది.

అవార్డులకు ఎంత గౌరవం ఇవ్వాలి అన్నది కూడా వ్యక్తిగత అభిరుచులపైనే ఆధారపడి ఉంటుంది. ఒక సంస్థ కొన్ని సంవత్సరాల క్రమంలో చేసిన అవార్డు ఎంపికలు మన అభిరుచులకి సరిపోతే మనం ఆ సంస్థ ఇచ్చే అవార్డులకు గౌరవం ఇస్తాము. లేకపోతే వాటిని పట్టించుకోవటం మానేస్తాం. తెలుగులోనూ, ఇతర భాషల్లోనూ నేను అభిమానించే రచయితలకు, పుస్తకాలకు పూర్వం చాలాసార్లు కేంద్ర సాహిత్య అకాడెమి బహుమతులు వచ్చాయి; అంచేత నాకు ఈ సంస్థ అవార్డులంటే ఇప్పటికీ మంచి అభిప్రాయమే ఉంది.

**పుస్తకం ముఖచిత్రం ఉదాత్తంగా లేదు** వంటి విమర్శలు ప్రధాన విషయాన్ని వదలి అనవసరంగా అప్రధాన విషయాలపైకి దృష్టి మళ్లిస్తాయి.

రచయిత రెండు పనులు చేసి ఉంటే బాగుండేది. మొదటిది, వివాదాస్పద విషయాలు రాస్తున్నప్పుడు వాటికి సరైన ఆధారాలు చూపెడితే రచయిత చిత్తశుద్ధి గురించి ప్రశ్నించే అవకాశం తగ్గేది. అనేక నగరాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఏ అధ్యాయానికి ఏ గ్రంథంలో ఆధారాలున్నాయో, నవలా రచయితగా తనకున్న కొద్దిపాటి స్వేచ్ఛను ఎలా ఎక్కడ వాడుకున్నారో తెలిపి, ఆ ఆధార గ్రంథాలను ప్రదర్శనగా పెట్టానని రచయిత ముందుమాటలో చెప్పారు. ఆ వివరాలను సమావేశాల్లో తెలపవల్సిన అవసరం ఉంది అనుకున్న రచయిత, వాటిని ఒక అనుబంధంగానో లేక పాదపీఠికలుగానో ముద్రించటం ఇలాంటి సందర్భాలలో పాటించవలసిన పద్ధతి. పాఠకులకు, విమర్శకులకు చాలా ఉపయుక్తంగా ఉండేది.

రెండవది నాకు చాలా తెలుగు పుస్తకాలతో ఉండే పేచీ. పుస్తకం పూర్తయిన తర్వాత, దాన్ని పరిశీలించి, సరిదిద్దే 'కాపీ ఎడిటర్ల' వ్యవస్థ లేకపోవడం మన పుస్తక ప్రచురణల నాణ్యతను బాగా దెబ్బతీస్తుందని నా నమ్మకం. ఆ లోటు ఈ పుస్తకంలో నాకు చాలా చోట్ల స్పష్టంగా కనిపించింది.

ఈ పుస్తకంలో కొన్ని విషయాల పట్ల నాకు అభ్యంతరాలు ఉన్నప్పటికీ, మొత్తమ్మీద పుస్తకాభిమాను లందరూ చదవవలసిన పుస్తకమేనని నా అభిప్రాయం. ఈ నవలలో నాయిక పట్ల నాకు గౌరవము, సానుభూతి కలిగేలా చేసిన రచయితకు నా అభినందనలు.

ఈ పుస్తకాన్ని విమర్శించదలచుకొన్నవారు పుస్తకం ఒకసారి కూలంకషంగా చదివాక విమర్శిస్తే అర్థవంతంగా చర్చించుకోవటానికి ఆస్కారం ఉంటుంది. విమర్శించటానికైనా ఈ పుస్తకాన్ని చదవాలా అనేవారికి నమస్కారం.

– జంపాల చౌదరి




ఇటీవల ఈ పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు వచ్చినప్పటి నుంచి వివిధ మీడియా రంగాలలో ఈ పుస్తకం మీద చాలా చర్చ జరుగుతున్నది. చర్చల్లో పాల్గొంటున్న కొంతమంది ఈ పుస్తకం సరిగ్గా చదవనే లేదని, పురాణ పాత్రలకు ఆధునిక భాష్యాలు చెప్పటంపై తమకు ఉన్న భావనల ఆధారంగానే మాట్లాడుతున్నారని నాకు అనిపించింది.

ఈ పుస్తకంలో ద్రౌపది చాలా బలమైన ఉద్వేగాలు (strong passions) కల వ్యక్తి. ఇది ఒక్క శృంగార విషయంలోనే కాదు. ఆమె రాగవిరాగాలలోనూ, ఆగ్రహానుగ్రహాలలోనూ కూడా అంతే. రచయిత ముందుమాట ప్రకారం ఈ నవలా రచనోద్దేశం: 'ఈ జన్మలో ద్రౌపదిగా ఏ కోరికలు ఈడేర్చుకోవటానికి పరమశివుని వరప్రసాదంగా జన్మించిందో, ఆ కోరికలు తీరాయా లేదా అన్న విషయం చర్చిస్తూ, ద్రౌపది మహోన్నతమైన వ్యక్తిత్వాన్ని, ప్రశంసనీయమైన ఆమె ఆత్మవిశ్వాసాన్ని, మహిళా లోకానికే మకుటాయమానంగా నిల్చిన ఆమె సౌశీల్యాన్ని, కుమార్తెగా, సోదరిగా, భార్యగా, తల్లిగా, శ్రీకృష్ణుని సఖిగా, మహారాజ్ఞిగా, రాజనీతిజ్ఞురాలిగా, విదుషీమణిగా, ఉత్తమ ఇల్లాలుగా, గృహిణిగా వివిధ రూపాలలో పరిఢవిల్లిన ఆమె వ్యక్తిత్వ గరిమను వివరించడమే'. ఈ పుస్తకం ఆసాంతమూ చదివినవారెవరికైనా ద్రౌపది కామేచ్ఛ మాత్రమే కనిపిస్తే వారితో తన దృక్పథం పంచుకోవటంలో రచయిత విఫలమైనట్లే. ఐతే దీనికి కారణం పాఠకుడా, రచయితా అన్నది ఆలోచించవలసిన విషయం.

## తొవ్వ

నినాదాల హోరుకు రహదారుల రెపరెపలు
దారుల నిండా పొంగిన పోరాట ప్రవాహం
రోడ్డు పొడుగూతా జైకొట్టిన తరంగాలు
అన్ని బాటలూ అలజడి బాటే

చౌరస్తాల నిండా స్తంభించిన సంచారం
ఆ నాలుగు బాటల కాడ గర్జించిన బొండిగలు
ర్యాలీలు ర్యాలీలుగా కదులుతున్న కాళ్లు
ఎక్కెక్కి పడుతున్న కడుపులోని కాంక్ష




ప్లకార్డులు ఫ్లెక్సీలు బ్యానర్లు గోడలు
అంతా ఉద్యమ వాతావరణ జాతర
ఏ గొంతు విన్నా! ఒక్కటే నినాదం
అస్తిత్వం అభిమానం ఆత్మగౌరవం

నిన్న మొన్నటి దాకా
రహదారులంటే రవాణాకే అనుకున్నాం
కాని ఇవాళ
రహదారులంటే గుండె గుండెల ఊరేగింపులు
రహదారులు ఆటపాటల సౌండ్ బాక్స్‌లు
ఇప్పుడు రహదారి ఉద్యమ వేదిక

బాట మీదనే వంటలు బాట పొంటనే దీక్షలు
బాట తిరుగుబాటుకు పీట

బండి బండికీ స్టిక్కర్లు
బస్సు బస్సుకూ బతుకు రాతలు
సకల వాహనాల పైనా
కోట్లాదిమంది కోరికల పంక్తులు

సైన్‌బోర్డ్‌లదీ అదే వరస
పరాయి పదం స్థానే
అస్తిత్వపు అక్షరాల అతుకుడు
రోడ్డు వాడ గోడ పల్లె పట్నం కాలనీ
యాడ సూడు ఒక్కటే లొల్లి
బతుకు పంచాయితీ బజార్లున్నది
తెంపుకునే వాయిద రావాలె

– అన్నవరం దేవేందర్

## బిడ్డలాలా!

మీ అవ్వను
చేతులు జోడిస్తున్న

నా తోడే
మిమ్మల్ని మీరు చంపుకోకుండ్రి

ఏడ్సెతందుకు నీల్లు లేవు నా కంట్ల
మొత్తుకునెతందుకు సత్తువలేదు నా ఒంట్ల

బరిసెలు గావల్సినోల్లు
నా కండ్ల ముందే కట్టెలవుతుంటె
వశపడుత లేదు

నిప్పులసుంటి కొడుకులు
నట్టింట్ల బూడిదైతుంటె
పానమాగుత లేదు

ఎండిన రొమ్ములకెల్లి
జీవం పిండి పోసిన
సేతికందకుంటనే ఎల్లిపోతర

బాంచెననిపించుకున్నోల్ని
బండకు కొట్టందే బతుకు సాలిస్తర

బిడ్డలాల మీరెందుకు సావాలె
బతికెటందుకు హక్కు లేనోల్లు
బాజాప్త తిరుగుతుంటె

లేత మొదుగాకులసుంటోల్లు
మీరెందుకు ఎండిపోవాలె
పచ్చని మామిడిపిందెలసుంటోల్లు
మీరెందుకు రాలిపోవాలె
నీల్ల మీద వెలుగుసుంటోల్లు
మీరెందుకు మాయమవాలె

బిడ్డలాల ఆశ విడువొద్దు
బతుకు మీద బరోస ఇడువొద్దు
నేల మీద కాల్లు గట్టిగుండాలె

నా పెయ్యి మీద తేలిన నరాలు చూడుండ్రి
ఉబ్బిన నరాలల్ల పొంగిన పోరాటం చూడుండ్రి
గన్నుల తోటి కొట్లాడి గెల్సిన
మనోల్ల రేషం చూడుండ్రి

మీరెందుకు బిడ్డా
కోడెలాగసుంటి మీ వయసుని
పానంలేని కట్టెను జేస్తరు
ఎర్రటి కొలిమసుంటి మీ కోపంమీద
సావునీల్లు జల్లుతరు

బిడ్డలాలా తాల్లు పేనింది
మీ కుతికెలకేసుకునెటందుకు గాదు
మనని తొక్కే మదపుటేన్గుల్ని
కట్టి నేలకొట్టెతందుకు

గాసునూనె డబ్బాలు మీ మీద పోసుకుని




నిండుపానం తీసుకునెటందుకు గాదు
మనకున్నదంత ఊడ్చుకున్న
బడాచోర్లను నడి బజార్ల
నిలబెట్టి భగ్గుమనిపిచ్చెటందుకు

రాండ్రి బిడ్డలాల
ఒక్కటవుదాం ఒక్కటిగుందాం
చేతులొక్కటి చేసి చప్పట్లు కొడదాం
'జీవితం జిందాబాదని'

మాటలొక్కటి జేసి
మంటిని మింటిని ఒక్కటి చేద్దాం
'చరిత్ర మనదేనని'

– నారాయణస్వామి

## ప్రజలదే ఆధునిక తెలుగుభాష

ఎవరిదీ ఆధునిక తెలుగు భాష? అంటూ 'వివిధ' (04.01.10)లో ప్రశ్నించిన ఎన్.మనోహర్‌రెడ్డి వ్యాసం నిండా వక్రీకరణలు, అసంబద్ధ ఆరోపణలు, అభ్యంతరకర నిర్ధారణలు అనేకం ఉన్నాయి. మచ్చుకు కొన్నైనా పాఠకుల దృష్టికి తేవడానికి ప్రయత్నిస్తాను. 20వ శతాబ్దారంభంలోనే భాషా ఛాందసవాదంపై తిరుగుబాటుగా వాడుక భాషా వాదాన్ని ప్రతిపాదించిన భాషా విప్లవకారుడు గిడుగు. వాడుక భాషకు లక్ష్యప్రాయమైన రచనలు చేసిన సాహిత్య విప్లవకారుడు గురజాడ. 'నాది ప్రజల ఉద్యమము– ఎవరినీ సంతృప్తి పరచడానికి నేను దీన్ని వదులుకోను' అని ప్రకటించడమే కాక 'యెల్లలోకము వొక్క యిల్లై, వర్ణభేదములెల్ల కల్లై, మతములన్నియు మాసిపోయి, జ్ఞానమొక్కటి నిలిచి వెలిగే' ఉదాత్త సమాజ నిర్మాణాన్ని గురజాడ ఆకాంక్షించాడు. 'కన్యాశుల్కం' నాటకంలోనూ, తను రాసిన కథలలోనూ, కవితలలోనూ వర్ణవ్యవస్థను, సామాజిక రుగ్మతలను తీవ్రంగా ఎండగట్టాడు. దేశభక్తికి నూతన నిర్వచనాన్నిచ్చాడు.

'గురజాడ కాలంలో వచ్చిన మార్పంతా సంప్రదాయ బ్రాహ్మణ భావజాలాన్ని గద్దె దింపి, ఆధునిక బ్రాహ్మణ భావజాలం ఆ స్థానాన్ని ఆక్రమించింది' అనడం సంచలనం కోసమో, చప్పట్లు కొట్టించుకోవడం కోసమో పనికొస్తుంది తప్ప హేతుదృష్టితో, సామాజిక పరిణామ క్రమాన్ని అధ్యయనం చేసే దృష్టితో చూస్తే తేలిపోతుంది. భూస్వామ్య సామాజిక వ్యవస్థ నుండి పెట్టుబడిదారీ ప్రజాస్వామ్య సామాజిక వ్యవస్థ దిశకు భారతీయ సమాజం పరిణామం చెందుతున్న దశలో ఒకవైపు సంప్రదాయ బ్రాహ్మణ పండితులు మార్పును వ్యతిరేకించే వాదాలను సామాజిక, భాష, సాహిత్య రంగాలలో ప్రతిపాదించారు. దీనికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్య భావనా బలంతో కందుకూరి సంఘసంస్కరణోద్యమాన్ని, గిడుగు భాషా సంస్కరణోద్యమాన్ని, గురజాడ సాహిత్య సంస్కరణోద్యమాన్ని సాహసోపేతంగా నిర్వహించారు. సమకాలీన బ్రాహ్మణ పండితుల నిరసనలకు, విమర్శలకు, ఈసడింపులకు లోనయ్యారు. అయినా తమది ప్రజల ఉద్యమమని ప్రకటించారు.

ఈ ముగ్గురు బ్రతికిన కాలం నాటి సామాజిక, భాషా, సాహిత్య రంగాలలో వారు నిర్వహించిన వీరోచితమైన ప్రతిఘటనాత్మక పాత్రను ఆనాటి అనుకూల చారిత్రక దృష్టితో అంచనా కట్టాలి. అంతేకానీ, వందేళ్ల తరువాత ఇవ్వాల్టి కళ్లద్దాలతో ఆనాటి సంస్కర్తల కృషిని తగ్గించి చూపడం, వక్రీకరించడం, వక్రభాష్యాలు చెప్పడం పైత్యం ప్రకోపించడమే అవుతుంది.

'ఆధునిక తెలుగు ప్రామాణిక భాష, తెలుగు మాట్లాడే ప్రజలందరి భాష కాదని, ఇది కేవలం ఆంధ్ర ప్రాంతంలోని అగ్రకులాల భాష మాత్రమే అనే అంశాలను తెలంగాణ ఉద్యమము, దళిత ఉద్యమము బలంగా పైకితీసుకొచ్చాయి. తెలుగు ప్రామాణిక భాష ఆధిపత్య రాజకీయ స్వభావం కలదనీ, దళితుల,తెలంగాణా భాషా సాహిత్య సంపదల్ని అణగదొక్కడం ద్వారా, కొల్లగొట్టడం ద్వారా తన ఆధిపత్యాన్ని నెలకొల్పుకొంటూ వస్తున్నదని స్పష్టం చేశారు' అంటున్న మనోహరుడు తన స్వీయ అక్కసునంతా తెలంగాణా ఉద్యమకారులకు, దళితఉద్యమకారులకు ఆపాదిస్తున్నాడు. 'ఆంధ్ర ప్రాంత అగ్రకుల ఆధిపత్య దోపిడి రాజకీయంలో భాగంగా' భాష విషయమై అర్థం చేసుకోవాలని చాలా బరువైన పదాలతో ఈ పరిశోధక విద్యార్థి భయపెడుతున్నాడు. తెలంగాణ, రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర మాండలికాలు వేరు కావొచ్చు. యాసలు వేరు కావచ్చు. కానీ భాష మాత్రం ఒక్కటే. అది తెలుగు భాష. లిపి మాత్రం ఒక్కటే. అది తెలుగు లిపి. భాషను వ్యవహార భాషగా వాడుతూ, పెంపొందిస్తూ, సుసంపన్నం చేసేది ప్రజలే. స్వాతంత్ర్యానికి పూర్వం అటు బ్రిటీషాంధ్రలోనూ, ఇటు నిజామాంధ్రలోనూ జనవ్యవహారంలో ఉన్న తెలుగు భాష జమిలిగా కలిసిపోయి ఇప్పుడు మనందరం మాట్లాడుకుంటున్న, రాసుకుంటున్న ఉమ్మడి తెలుగు వాడుక భాష రూపొందింది. దీని రూపశిల్పులు ప్రజలే. ఆయా కులాలు, వృత్తి సముదాయాలు, ప్రాంతాలు వాడే విలక్షణమైన మాండలిక పద భేదాలు, సాంకేతిక పదబంధాలు, వృత్తి పదాలు కొన్ని వేర్వేరుగా ఉంటాయి. అయినా నిత్య వ్యవహారంలో విభిన్న కులాల, ప్రాంతాల, వృత్తుల సమూహాలతో మనం జరిపే సంభాషణల ద్వారా, కార్యకలాపాల ద్వారా రూపొందిన ఆధునిక తెలుగుభాష ప్రజలందరి ఉమ్మడి సొత్తు. రాష్ట్రం ఒక్కటిగా ఉన్నా, విడిపోయినా నిమిత్తం లేదు. భాష మాత్రం ఒక్కటే.

– ఎస్వీ సత్యనారాయణ

## బిఎస్ గౌతమి పురస్కారం కోసం

బొందుగులపాటి అహల్యా-సుందరరావు స్మారక గౌతమి పురస్కారం కోసం కథా సంపుటాలను ఆహ్వానిస్తున్నాం. 2006–08 మధ్య ప్రచురితమైన సంపుటాల నాలుగేసి ప్రతులను ఫిబ్రవరి 15లోగా డా.బిదామోదరరావు, 8–2–379, భగత్ నగర్, శివాలయం దగ్గర, కరీంనగర్–505001 చిరునామాకు పంపించాలి. పురస్కారం కింద 5 వేలు నగదు, ప్రశంసాపత్రం అందించడం జరుగుతుంది.

– మాడిశెట్టి గోపాల్, సాహితీ గౌతమి

## 'పొక్కిలి' కథకు వట్టికోట పురస్కారం

2009కిగాను వట్టికోట ఆళ్వారుస్వామి కథా పురస్కారం కొరకు కరీంనగర్ జిల్లాకు చెందిన వెల్దండ శ్రీధర్ 'పొక్కిలి' కథ ఎంపికైంది. న్యాయనిర్ణేతలుగా నందిని సిధారెడ్డి, జింబో, ఎకె ప్రభాకర్ వ్యవహరించారు.

– వేముగంటి రఘునందన్

## 'వలసపత్రం'కు రంగినేని ఎల్లమ్మ అవార్డు

కీ.శే.రంగినేని ఎల్లమ్మ స్మారక అవార్డు 2009కిగాను సంగెవేని రవీంద్ర కవితా సంపుటి 'వలస పత్రం' ఎంపికైంది. ఫిబ్రవరి 7న ఉ.11 గం.లకు రంగినేని ట్రస్ట్, సిరిసిల్లలో జరిగే కార్యక్రమంలో అవార్డు ప్రదానం (11 వేలు నగదు) జరుగుతుంది. ముఖ్య అతిథిగా అనుమాండ్ల భూమయ్య, విశిష్ట అతిథిగా కె.శ్రీనివాస్ పాల్గొంటారు. కవిపరిచయం అన్నవరం దేవేందర్ చేస్తారు.

–రంగినేని మోహన్‌రావు, రంగినేని ట్రస్ట్, అవార్డు కమిటి

## ఉత్తరాంధ్ర, ఆదివాసీ స్త్రీల సాహిత్యంపై చర్చ

సెంటర్ ఫర్ విమెన్ స్టడీస్, ఆంధ్రా యూనివర్సిటీ, 'మనలో మనం' రచయిత్రుల వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర సదస్సు ఫిబ్రవరి 27, 28 తేదీలలో విశాఖపట్నంలో జరుగుతుంది. ఉత్తరాంధ్ర, ఆదివాసీ స్త్రీల సాహిత్యంపై చర్చ, పత్ర సమర్పణలు జరుగుతాయి. ఈ సదస్సులోనే 'మనలో మనం' వేదిక పూర్తిస్థాయి నిర్మాణాన్ని పొందనుంది. రచయిత్రులందరూ హాజరుకావాలని కోరుతున్నాం. భోజన, వసతి సదుపాయాలు కల్పించబడతాయి. వివరాలకు నిర్వాహకులు ఆచార్య బి.రత్నకుమారి–98662 98798, మల్లీశ్వరి–92466 16788 లను సంప్రదించవచ్చు.

– 'మనలో మనం' రచయిత్రుల ఉమ్మడి వేదిక